

కాలంతో పోటీ.. అర్లి(టి) 8లో▸

అర్లి(టి) గ్రామంలో వేసవిలో అత్యధిక.. శీతాకాలంలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వానాకాలంలోనూ అత్యధిక వర్షం కురవడం ఇక్కడి ప్రత్యేకత.



ఆపద్బాంధవులు..! 9లో▸

చింతలమానెపల్లి మండలానికి చెందిన పలువురు యువకులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిరుపేదలు, దివ్యాంగులకు ఆపద్బాంధవులుగా మారారు.

గరిష్టం/కనిష్టం
41.0/29.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్ర కొనసాగుతుంది. ఉక్కపోత అధికంగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌: తెలంగాణ అకాడమీ ఫర్‌ స్కిల్‌ అండ్‌ నాలెడ్జ్‌ (టాస్క్‌) ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ చాహత్‌బాజ్‌పాయి ఓ ప్రకటనలో సూచించారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన బేసిక్‌ ఐటీ అండ్‌ అడ్వాన్స్‌ ఎక్సెల్‌ శిక్షణ టాస్క్‌ కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. వారం పాటు కొనసాగే శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7993859595 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నాణ్యమైన సేవలందించాలి



ఆస్పత్రిలోని రికార్డులు పరిశీలిస్తున్న సభ్యులు

తిర్యాణి: ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలందించాలని కేంద్ర హెల్త్‌ అండ్‌ వెల్‌నెస్‌ పరిశీలన బృందం సభ్యులు అనంత్‌కుమార్‌, జవహర్‌ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రసూతి సేవలకు సంబంధించిన వివరాలు, టీ హబ్‌ కార్యక్రమం అమలు తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలందించడం ద్వారా వైద్య సిబ్బందికి మంచి గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. అనారోగ్యానికి గురైన వారికి తప్పనిసరిగా రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్‌, డీడీవో సిద్ధార్థ, వైద్యులు వెంకటేశ్‌, కృష్ణ, శ్రీవాణి, వైద్యసిబ్బంది శ్రీనివాస్‌, ప్రమీల తదితరులున్నారు.

'దశాబ్ది' ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ 'సుంకరి'

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలో జూన్‌ 2న నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సుంకరి రాజు హాజరు కానున్నారు. గతేడాది ప్రభుత్వ విప్‌ అరికెపూడి గాంధీ హాజరు కాగా, ఈ ఏడాది ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్సీ సుంకరి రాజును నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

దోస్త్‌ సహాయ కేంద్రం ఏర్పాటు

కాగజ్‌నగర్‌రూరల్‌: కాగజ్‌నగర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థుల కోసం జిల్లాస్థాయి దోస్త్‌ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్‌ లక్ష్మీనరసింహం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌ ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీ ప్రవేశాల విషయంలో సాంకేతిక సమస్యలేర్పడితే కళాశాలలోని సహాయ కేంద్ర సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.

జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



విత్తనాలు పంపిణీ చేస్తున్న మాంతయ్య

కౌటాల: జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్‌ వైస్‌ చైర్మన్‌ కుమురం మాంతయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల కోసం ప్రభుత్వం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందిస్తుందన్నారు. సహకార కేంద్రంలో 40 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో రాజేశ్‌ తెలిపారు. 30కిలోల విత్తనాల బస్తా ధర రూ.2,407కాగా 65 శాతం సబ్సిడీతో రూ.843కు అందిస్తున్నట్లు తెలిపారు. జీలుగ సాగు చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. సర్పంచ్‌ వొజ్జల మౌనిక్‌, సీఈవో రాజేశ్‌, ఏఈవో ఘన్‌శ్యాం, డైరెక్టర్లు శైలేశ్‌, ఎల్లయ్య పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

కౌటాల: మండలంలోని విజయనగరం సెయింట్‌ జోసెఫ్‌ ఎయిడెడ్‌ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలుసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఫాదర్‌ జేమ్స్‌, ఎంఎల్‌ మారయ్య, శ్రీనివాస్‌గౌడ్‌, ఫాదర్‌ సీజో, టామ్‌, వేరోనిక పాల్గొన్నారు.



నిర్మాణ దశలో వైద్యకళాశాల భవనం

నిర్మాణం.. శరవేగం

- చురుకుగా వైద్యకళాశాల పనులు
- 45 గదులతో భవన నిర్మాణం
- ఆగస్టు నుంచి ఫస్టియర్‌ క్లాస్‌లు
- తరగతి గదులు, ల్యాబ్‌లు సిద్ధం!
- జిల్లా ఆస్పత్రిపై అదనపు పడకల కోసం గదుల నిర్మాణం
- రెండు ప్రైవేట్‌ భవనాల్లో విద్యార్థుల కోసం హాస్టళ్ల ఏర్పాటు



జిల్లా ఆస్పత్రి భవనంపై నిర్మిస్తున్న అదనపు గదులు

సాక్షి, ఆసిఫాబాద్‌: కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లాలో నిర్మిస్తున్న నూతన వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 45 గదులతో నిర్మిస్తున్న ఈ భవనంలో ఆగస్టు నుంచి ఫస్టియర్‌ తరగతులు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాట్లు తుది దశకు చేరాయి. వైద్యకళాశాలకు అనుబంధంగా జిల్లా కేంద్రంలోని 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని 300 పడకల స్థాయికి తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే ఆస్పత్రి పైభాగంలో అదనపు పడకల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వైద్యవిద్యార్థుల హాస్టళ్ల కోసం జిల్లా కేంద్రంలో రెండు వేర్వేరు భవనాలు అద్దెకు తీసుకుని వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

ఎన్‌ఎంసీ అనుమతులు మంజూరు

ఈ ఏడాది నుంచి ఎంబీబీఎస్‌ తరగతుల ప్రారంభానికి జాతీయ వైద్యమండలి (ఎన్‌ఎంసీ) అనుమతులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆసిఫాబాద్‌లో కళాశాలకు ప్రాథమిక అనుమతి ఇవ్వగా.. ఈ కొత్త వైద్యకళాశాలలో 100 ఎంబీబీఎస్‌ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. నీట్‌ యూజీ ప్రవేశ పరీక్ష ఇటీవల ముగిసింది. ఫలితాలు వచ్చిన వెంటనే కౌన్సెలింగ్‌ ప్రక్రియకు శ్రీకారం చుడతారు. ఆ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు తొలుత 300 పడకల ఆస్పత్రి కోసం నిర్మిస్తున్న భవనాన్ని ప్రస్తుతం వైద్యకళాశాల కోసం మార్పులు చేసి నిర్మిస్తున్నారు. తొలి ఏడాది చదివే విద్యార్థులకు అవసరమైన రెండు తరగతి గదులు, మూడు ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నారు.

బోధన సిబ్బంది నియామకం

జిల్లా వైద్యకళాశాలలో 22మంది అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ ప్రాథాలజీ, ఫోరెన్సిక్‌ మెడిసిన్‌ విభాగాలకు ఒక అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ చొప్పున నియమించింది. అలాగే జనరల్‌ సర్జరీ విభాగంలో నలుగురు, జనరల్‌ మెడిసిన్‌కు ముగ్గురు, పీడియాట్రిక్‌ ఇద్దరు, ఫిజియాట్రికి ఒకరు, రేడియోగ్నాసిస్‌ ఒకరు, ఆర్థోపెడిక్‌ ఒకరు, ఓబీజీ విభాగంలో ఇద్దరు, అనస్తీసియాకు ముగ్గురు చొప్పున అసిస్టెంట్‌ ప్రొఫెసర్లను నియమించింది.

హాస్టళ్ల కోసం రెండు అద్దె భవనాలు

మొత్తం 100 సీట్లలో 60 మంది వైద్య విద్యార్థినులు, 40 మంది విద్యార్థులు రానుండగా.. వీరి వసతి ఏర్పాట్లు పూర్తి కాకపోవడంతో జిల్లా కేంద్రంలో అద్దెకు రెండు భవనాలు తీసుకున్నారు. విద్యార్థుల కోసం గుండి రోడ్డులో ఉన్న ఒక భవనాన్ని అద్దె ప్రాతిపదికన తీసుకున్నారు. విద్యార్థినుల కోసం సందీప్‌నగర్‌లోని ఓ భారీ భవంతిని అద్దెకు తీసుకుని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

వైద్యకళాశాల ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి రిజ్వి
- కలెక్టర్‌, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌, అధికారులు

ఆసిఫాబాద్‌: 2023–24 విద్యాసంవత్సరానికి మంజూరైన వైద్య కళాశాలలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి రిజ్వి సూచించారు. శనివారం హైదరాబాద్‌ నుంచి డైరెక్టర్‌ ఆఫ్‌ మెడికల్‌ ఎడ్యుకేషన్‌, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, వైద్యకళాశాలల ప్రిన్సిపాల్‌లు, వైద్యారోగ్యశాఖ అధికారులు, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యదర్శి రిజ్వి మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్య పెంచేలా రాష్ట్ర వ్యాప్తంగా వైద్య కళాశాలలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో చేపట్టిన కళాశాలల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయించాలని సూచించారు. కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే మాట్లాడుతూ.. వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయని తెలిపారు. రెండు విడతల్లో పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైద్య కళాశాల భవనంలో తలుపులు, కిటికీల ఏర్పాటు, రంగులు వేసే పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కళాశాలలో వైద్యవిద్యను అభ్యసించే విద్యార్థుల కోసం హాస్టళ్ల ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. జూన్‌ 15లోగా పనులు పూర్తి చేసేలా చూస్తామని చెప్పారు. సమావేశంలో డీఎంహెచ్‌వో రామకృష్ణ, వైద్యకళాశాల ప్రిన్సిపాల్‌ నాగార్జునాచారి, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రేవయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి



రేవయ్య, విస్తారుబాయిని సన్మానిస్తున్న కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అధికారులు

- కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే
- 'సివిల్‌' ర్యాంకర్‌కు సన్మానం

ఆసిఫాబాద్‌: యువత రేవయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే సూచించారు. ఇటీవల సివిల్‌ సర్వీసెస్‌ ఫలితాల్లో 410 ర్యాంక్‌ సాధించిన రెబ్బెన మండలం తుంగెడకు చెందిన డోంగ్రి రేవయ్యను అదనపు కలెక్టర్‌ రాజేశం, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి శనివారం కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. జిల్లా నుంచి ఐఏఎస్‌కు ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. పేదరికాన్ని జయించి ఉన్నత లక్ష్యాన్ని సాధించిన రేవయ్య కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్‌, ఎంపీపీ మల్లికార్జున్‌ పాల్గొన్నారు.



రేవయ్యను అభినందిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్‌

రేవయ్యను సన్మానించిన ఎస్పీ

సివిల్‌ సర్వీసెస్‌లో 410 ర్యాంక్‌ సాధించిన రెబ్బెన మండలం తుంగెడకు చెందిన డోంగ్రి రేవయ్యను ఏఆర్‌ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ సురేశ్‌కుమార్‌ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పట్టుదల, కృషి, లక్ష్యం ఉంటే ప్రతిఒక్కరూ విజయం సాధిస్తారనడానికి రేవయ్య ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. యువత రేవయ్యను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

రేవయ్య ఇంటికి బెల్లంపల్లి ఎమ్మెల్యే



సన్మానం తర్వాత రేవయ్యతో ఎమ్మెల్యే చిన్నయ్య

రెబ్బెన: సివిల్స్‌లో 410 ర్యాంక్‌ సాధించిన రేవయ్యను బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మండలంలోని తుంగెడ గ్రామంలోని అతడి ఇంటికి వెళ్లి కలిశారు. ఎమ్మెల్యేతోపాటు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాలు, కుల, ప్రజాసంఘాల నాయకులు, విద్యావేత్తలు రేవయ్య, అతడి తల్లి విస్తారుబాయిని పూలమాలలు, శాలువాలతో సన్మానించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి శిక్షణ లేకుండా సివిల్స్‌లో ఆలిండియా 410 ర్యాంక్‌ సాధించిన రేవయ్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అలాగే నీట్‌లో ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన తుంగెడకు చెందిన డోంగ్రి కిష్టయ్య కూతురు మమత, ఇటీవల విడుదలైన ఇంటర్‌ ఫలితాల్లో 980 మార్కులు సాధించిన డోంగ్రి సాత్వికను ఎమ్మెల్యే చిన్నయ్య సన్మానించారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, బీఆర్‌ఎస్‌ నాయకులు జుమ్మిడి ఆనంద్‌, దుర్గం భరద్వాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌: తెలంగాణ అకాడమీ ఫర్‌ స్కిల్‌ అండ్‌ నాలెడ్జ్‌ (టాస్క్‌) ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్‌ చాహత్‌బాజ్‌పాయి ఓ ప్రకటనలో సూచించారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన బేసిక్‌ ఐటీ అండ్‌ అడ్వాన్స్‌ ఎక్సెల్‌ శిక్షణ టాస్క్‌ కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. వారం పాటు కొనసాగే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 7993859595 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి

- ఎస్పీ సురేశ్‌కుమార్‌
- అధికారులతో సమీక్ష



హాజరైన పోలీస్‌ అధికారులు

ఆసిఫాబాద్‌: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలని ఎస్పీ కే సురేశ్‌కుమార్‌ సూచించారు. జూన్‌ 2నుంచి 22వ తేదీ వరకు జిల్లాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలు శనివారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో చేపట్టే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఉత్సవాల్లో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జూన్‌ 4న సురక్ష దినోత్సవం, 12న తెలంగాణ రన్‌ ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఉత్సవాల్లో శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాస్‌, కరుణాకర్‌, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న రాజేశం

ఆసిఫాబాద్‌: బీజేపీ మతోన్మాద విధానాలను వ్యతిరేకించాలని ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా కన్వీనర్‌ రంగు రాజేశం సూచించారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్‌ హాల్‌లో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ కార్పొరేట్‌ శక్తులకు ఊడిగం చేస్తూ సరళీకృత ఆర్థిక విధానాలను దూకుడుగా అమలు చేయడాన్ని కార్మిక సంఘాలు, సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. సంఘటిత, అసంఘటిత రంగ ఉద్యోగులు, కార్మికుల జాతీయ సమ్మెలు, రాష్ట్ర వ్యాప్త పోరాటాలు ఉధృతంగా కొనసాగుతున్నా బీజేపీ ప్రభుత్వం నిరంకుశ వైఖరిని మార్చుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలతో పారిశ్రామిక రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆరోపించారు. సెమినార్‌లో సీఐటీయూ నాయకులు అల్లూరి లోకేశ్‌, ముంజం శ్రీనివాస్‌, రాజేందర్‌, ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధులు కల్పన, శ్రీలత, కవిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పోరు గ్రామాల్లో 'నో సిగ్నల్‌'

- హలో.. హలో.. కు తప్పని తిప్పలు
- ఇబ్బందుల్లో గిరిజనం, ఉద్యోగులు



సిగ్నల్‌ కోసం కిలో మీటర్‌ దూరం వచ్చిన లైన్‌పటార్‌ యువకులు

కెరమెరి(ఆసిఫాబాద్‌): గిరిజనుల కోసం నైజాం ప్రభుత్వంతో పోరాడి అసువులు బాసిన వీరుడు కొమురంభీం పోరు గ్రామాల్లో నేటికీ సెల్‌ సిగ్నల్‌ అందడం లేదు. సెల్‌ సిగ్నల్‌ కోసం గుట్టలు, చెట్లెక్కుతూ ఆయా గ్రామాల గిరిజనం ఇబ్బందులు పడుతున్నారు. నైజాం ప్రభుత్వంతో వీరోచితంగా పోరాటం చేసిన చారిత్రాత్మక గ్రామమైన జోడేఘాట్‌తో పాటు మిగతా 13 గ్రామాలు 'సెల్‌' సేవలకు నోచుకోవడంలేదు. పిట్టగూడ నుంచి జోడేఘాట్‌ వరకు ఎక్కడా మొబైల్‌ సేవలు అందడం లేదు. క్షణాల్లో సమాచారాన్ని విశ్వవ్యాప్తం చేసే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన ఈ తరుణంలో ఈ గ్రామాల ప్రజలు కనీసం పొరుగు గ్రామాల్లో ఉన్న బంధువులతో మాట్లాడలేని పరిస్థితి. జోడేఘాట్‌లోని కొన్ని ప్రాంతాల్లో అరుదుగా బీఎస్‌ఎన్‌ఎల్‌, ఐడియా సిగ్నల్‌ వస్తున్నా మిగతా 13 గ్రామాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

వినతులపై పట్టింపేది?

మండలంలోని పోరుగ్రామాలైన పిట్టగూడ, టొకెన్‌మోవాడ్‌, లైన్‌పటార్‌, చాల్‌బాడి, పాటగూడ, బాబేఝరి, నాయకపుగూడ, మహరాజ్‌గూడ, కొలాంగూడ, శివగూడ, చిన్నపాట్నాపూర్‌, పెద్దపాట్నాపూర్‌, జోడేఘాట్‌ గ్రామాల్లో 908 కుటుంబాలుండగా.. 1,598 వరకు జనాభా ఉంటుంది. రెండు ఆశ్రమ పాఠశాలలు, మూడు ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఉపాధ్యాయులతో పాటు ప్రజలు ఇక్కడకు వచ్చిన ప్రతీ అధికారితో సెల్‌ టవర్ల విషయమై వినతులు సమర్పిస్తున్నా వారు మాత్రం 'చేస్తాం.. చూస్తాం'తోనే సరిపెడుతున్నారు. దీంతో చాలా సందర్భాల్లో బాబేఝరి, జోడేఘాట్‌ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల సమాచారం అందక చివాట్లకు గురైన సందర్భాలున్నాయి. ఐటీడీఏ ప్రాజెక్ట్‌ అధికారి కార్యాలయం నుంచి ప్రతీరోజు ఎన్నో మెసేజ్‌లు వస్తుంటాయి. వాటికి ఎప్పటికప్పుడు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ.. సెల్‌ సిగ్నల్‌ లేక పోవడంతో తగిన సమయానికి అందడం లేదు. మళ్లీ సాయంకాలానికి గుట్టలు దిగి కెరమెరికి వచ్చే వరకూ సమాచారం తెలియడంలేదు. అప్పటికే పుణ్యకాలమంతా గడిచిపోతోంది. అధికారులు తక్షణమే స్పందించి సెల్‌ సేవలు అందించాలని పోరుగ్రామాల ప్రజలు, ఇక్కడ పని చేసే ఉద్యోగులు కోరుతున్నారు.

పర్యాటకుల అవస్థలు వర్ణనాతీతం

ప్రభుత్వం పర్యాటక ప్రాంతంగా గుర్తించి జోడేఘాట్‌లో రూ.25 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపట్టింది. ఇక్కడున్న అందాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకుల తాకిడి కూడా అధికంగా ఉంటుంది. కానీ.. ఇక్కడి సమాచారం బయటివారికి షేర్‌ చేద్దామనుకుంటే మొబైల్‌ పని చేయదు. దీంతో పర్యాటకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

అధికారులు స్పందించాలి



సెల్‌ లేకుంటే ప్రపంచానికి దూరంగా ఉన్నట్లే. మా వద్ద నుంచి కబురు బయటికి పోదు. బయటి నుంచి సమాచారం మాకందదు. సెల్‌ సిగ్నల్‌ లేక చాలా కష్టమవుతోంది. అనారోగ్యానికి గురైనా, ఏదైన ప్రాణహాని జరిగినా ఎవరు బాధ్యత వహిస్తారు. తక్షణమే అధికారులు స్పందించాలి.

– పెందోర్‌ రాజేశ్వర్‌, జోడేఘాట్‌

సెల్‌ సేవలు అందించాలి



మేము బడిలో ఉన్నప్పుడు అధికారుల నుంచి వచ్చే సమాచారం తెలియడం లేదు. ఏ నెట్‌వర్క్‌ కూడా అందకపోవడంతో సెల్‌ మోగడం లేదు. గుట్ట దిగితేనే గానీ సెల్‌ఫోన్‌ మోగదు. ఇలాంటి సమయంలో అధికారులు నుంచి చివాట్లు పడ్డ సందర్భాలున్నాయి. వెంటనే సెల్‌ సేవలు అందించాలి.

– కుమురం జంగు, హెచ్‌ఎం, బాబేఝరి

భూసర్వే చేపట్టి నివేదిక అందించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ హేమంత్‌

తిర్యాణి: సీఏ ల్యాండ్‌ కోసం కేటాయించిన ప్రభుత్వ భూమికి సంబంధించి సర్వే చేపట్టి నివేదిక అందించాలని కలెక్టర్‌ బోర్కడే హేమంత్‌ ఆదేశించారు. పంగిడిమాదర పంచాయతీ పరిధిలో సీఏ ల్యాండ్‌ కోసం కేటాయిస్తున్న భూమిని శనివారం ఆయన అడిషనల్‌ కలెక్టర్‌ రాజేశం, జిల్లా ఫారెస్ట్‌ అధికారి నీరజ్‌ కుమార్‌ టిబ్రెవాల్‌, ఆర్డీవో రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ.. సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సీఏ ల్యాండ్‌ కోసం కేటాయిస్తున్న భూముల్లో ప్రస్తుతం సాగులో ఉన్న ఎనిమిది మంది రైతులకు ప్రత్యామ్నాయంగా 16 ఎకరాలను మరో చోట కేటాయించాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్‌ అనంతరాజు, ఎఫ్‌ఆర్వోలు శ్రీనివాస్‌, అప్పలకొండ, ల్యాండ్‌ సర్వే రికార్డ్‌ ఏడీ సోమేశ్వర్‌, రెవెన్యూ, ఫారెస్ట్‌ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడి మృతి



బోడకుంటి మల్లన్న (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గుడిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోడకుంటి మల్లన్న(48) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. వివరాల ప్రకారం... దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌కు చెందిన మల్లన్న పది సంవత్సరాలుగా గుడిపేట ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నాడు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడంలోనే కాకుండా ఉత్తీర్ణత శాతం మెరుగ్గా ఉండేలా విశేష కృషి చేశాడు. గ్రామంలోనూ అందరితో కలిసి ఉంటూ పిల్లల చదువులో ప్రత్యేక చొరవ చూపేవాడు. మల్లన్న ఏడాదిగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉన్నారని ఈ క్రమంలో శనివారం ఆరోగ్య పరిస్థితి విషమించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లన్న ప్రస్తుతం పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా కొనసాగుతుండగా మృతుడికి భార్య సత్యలీల, కుమార్తె శిరీషా, కుమారుడు అవినాశ్ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య



రమేష్ మృతదేహం

లక్సెట్టిపేట: ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణ పరిధిలోని ఇటిక్యాలలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ వివరాల ప్రకారం... మాదాసు రమేశ్(46) ఆటో ట్రాలీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. ఈ నెల 24న మనస్తాపానికి గురై పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం లక్సెట్టిపేట ఆస్పత్రికి తీసుకురాగా పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి పూర్తిగా క్షీణించడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పురుగుల మందు తాగి యువకుడు..

లక్సెట్టిపేట: మండలంలోని కొత్తూర్‌కు చెందిన గుండారపు శ్రీనివాస్(22) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీనివాస్ లక్సెట్టిపేటలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. అతడికి ఇంకా పెళ్లి కాలేదు. ఈ విషయంలో ఈ నెల 25న దుకాణం నుంచి రాత్రి ఇంటికి వచ్చిన తరువాత తల్లిదండ్రులు పెళ్లి విషయం ప్రస్తావించారు. దీంతో కోపంతో గదిలోకి వెళ్లి పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): మండలంలోని పెద్దబండ గ్రామ సమీపంలోని భీమన్న ఆలయం వద్ద పేకాటాడుతున్న పలువురిని సీఐ షాదిక్ పాషా, సిర్పూర్(టి) ఎస్సై డీకొండ రమేష్ ఆధ్వర్యంలో దాడిచేసి శనివారం పట్టుకున్నారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కాలంతో పోటీ.. అర్లి(టి)

• సీజనల్ స్పెషల్.. ఈ ఊరు • ఏటా రికార్డుస్థాయి పగటి ఉష్ణోగ్రతలు • శీతాకాలంలోనూ చలి అధికం • భాగోళిక పరిస్థితులే కారణం

సండే స్పెషల్

సాక్షి, ఆదిలాబాద్ డెస్క్: సీజనల్ స్పెషల్ ఈ ఊరు. జిల్లాలోనే అత్యధిక, అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతం ఇది. వేసవిలో ఉష్ణోగ్రతలు.. శీతాకాలంలోనూ చలి అధికంగా నమోదు కావడం ఇక్కడి ప్రత్యేకత. ఓ సీజన్‌లో గజగజ వణికిస్తూ.. మరో సీజన్‌లో నిప్పుల కుంపటిని తలపించే ఆ ఊరే ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని అర్లి(టి).



గ్రామంపై కప్పకున్న పొగమంచు(ఫైల్)

భౌగోళిక అంశాలే..

భౌగోళికపరంగా ఈ గ్రామం సముద్రమట్టానికి 286 మీటర్ల ఎత్తున ఉంటుంది. ఇది పూర్తిగా బండ ప్రాంతం. అలాగే ఓ వైపు అటవీ ప్రాంతం మరోవైపు ఎత్తైన ఐదు కొండలు పరుచుకుని ఉన్నాయి. వేసవిలో సూర్య ప్రభావంతో వేడెక్కిన గుట్టలతో ఉష్ణోగ్రత పెరిగి గరిష్ఠంగా నమోదవుతుంటుంది. ఇక చలికాలంలో శీతల గాలులు, మంచు ప్రభావం కొండల సరిహద్దుకే పరిమితం అవడంతో ఈ ప్రాంతంపై అధిక ప్రభావం చూపుతోంది. దీంతో స్థానికులను చలి వణికిస్తుంది.



చలిమంట కాగుతున్న వృద్ధురాలు(ఫైల్)

అలాగే వర్షాకాలంలోనూ అటవీప్రాంతం, కొండల ప్రభావం, పెన్‌గంగా ప్రవాహం కారణంగా వర్షపాతం కూడా అధికంగానే నమోదవుతుంది.

వేసవిలో మండే ఎండ..



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా అర్లి(టి)

ఇక సమ్మర్‌లో ఉదయం ఏడు దాటిందంటే చాలు.. వేడి దడ పుట్టిస్తోంది. రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు న మోదవుతుంటాయి. ఈ ఏడాది ఇప్పటికే 45 డిగ్రీల మార్కుకు చేరువైంది. ఈ సీజన్‌లో చేను పనులు ఉదయం 5 నుంచి మొదలై 10 గంటలకు ముగుస్తా యి. మధ్యాహ్నం గ్రామస్తులు అంతా ఇళ్లలోనే గడుపుతారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తాయి. స్థానికులు చల్లదనం కోసం తొగరి కట్టెలతో పందిరి ఏర్పాటు చేసుకుంటారు.

చలికాలం.. మరో ఊటి

చలికాలం తీవ్రమైన చలి ఉంటుంది. సూర్యోదయ సమయంలో మంచుదుప్పటి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. పొగమంచు ప్రభావంతో ఈ ప్రాంతం చూపరులను కనువిందు చేస్తోంది. ఇక్కడ 2021లో రికార్డుస్థాయిలో 3.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ సీజన్‌లో స్థానిక బస్టాప్ వద్ద 24 గంటలు చలిమంటలు ఏర్పాటు చేస్తారు. ఈ సమయంలో ఆవులకు గోనె సంచులతో చేసిన దుస్తులు వేయడం ప్రత్యేకత. చలి నుంచి రక్షణ కోసం స్థానికులకు గొంగళ్లు పంపిణీ చేస్తుంటారు. వేకువజామున కొంచవల్లి దర్గా, రాముల గుట్ట నుంచి చూస్తే మంచుతెరలతో ప్రకృతి కనువిందు చేస్తోంది. డిసెంబర్‌లో ఒక వారంలో సూర్యుడు మధ్యాహ్నం రెండు గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటలకే అస్తమిస్తాడు. రెండు, మూడు రోజులయితే భానుడు అసలే కనిపించడని స్థానికులు చెబుతుంటారు.



చలికాలంలో కమ్ముకున్న పొగమంచు



చలికాలంలో పశువులపై కప్పిన గన్నీ దుస్తులు (ఫైల్)

గ్రామంలో చలి, ఎండ ఎక్కువ..



మా ఊర్లో చలికాలంలో చలి, ఎండాకాలంలో ఎండ రికార్డుస్థాయిలో ఉంటది. వర్షం కూడా ఎక్కువే. వాతావరణం ఎలా ఉన్నా తట్టుకోవడం అలవాటు చేసుకున్నాం. చలి కాలంలో జాగ్రత్తలు తీసుకుంటాం. చలిమంటల ద్వారా ఉపశమనం పొందుతాం. ఆవులకు గోనెసంచుల దుస్తులు వేస్తాం. ఇప్పుడైతే ఎండ దంచి కొడుతుంది. ఇప్పటికే ఎండ 45 డిగ్రీలకు వచ్చిందటున్నరు.

– పిట్ల దేవారెడ్డి, అర్లి(టి) గ్రామం

చుట్టూ రాతి గుట్టల కారణంగానే..



అర్లి(టి)లో భిన్నమైన వాతావరణానికి భౌగోళిక పరిస్థితులే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్రామం చుట్టూ ఎత్తైన రాతి గుట్టలు ఉన్నాయి. వేసవిలో ఎండల కారణంగా ఈ గుట్టలు వేడెక్కి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అలాగే సమీపంలోనే పెన్‌గంగతో పాటు అటవీప్రాంతం ఉండడంతో శీతాకాలంలో చలిసైతం రికార్డుస్థాయిలో నమోదవుతుంది. వర్షపాతం కూడా అధికంగా ఉన్నందున రెయిన్‌గేజ్ ఏర్పాటు చేశాం.

– వెంకటరమణ, సీపీవో, ఆదిలాబాద్

జాతీయ విశిష్ట సేవారత్న అవార్డుకు శ్రీపతి ఎంపిక



అవార్డు అందుకుంటున్న శ్రీపతి

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లాకు అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి శ్రీపతి శనివారం జాతీయ విశిష్ట సేవా రత్న అవార్డును అందుకున్నారు. ఎస్ఎస్‌బీఎం ఆధ్వర్యంలో గోవా పట్టణంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఎస్ఎస్‌బీఎం మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్, జున్ను ఇర్మియ అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రామగిరి శ్రీపతి మాట్లాడుతూ.. అంబేద్కర్ యువజన సంఘం ద్వారా సమాజంలో సామాజిక కార్యక్రమాలు నిర్వహించి, ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులుగా చేసినందుకే అవార్డుకు ఎంపిక జేశారన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు అట్కపురం రాయలింగు, ఐత పరమేశ్వర్, చాపిడి సందీప్, ఎల్కపల్లి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య



నారాయణ(ఫైల్)

బెజ్జూర్: మండలంలోని చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టకిరే నారాయణ(50) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నారాయణ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి భరించలేక శనివారం తెల్లవారు జామున పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సిర్పూర్ (టి)లోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భార్య సంతర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు వెళ్లకముందే... గేటు తెరిచారు

• తప్పిన పెనుప్రమాదం



గేటు తీయడంలో లోపలకి వెళ్లిన వాహనాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో బుర్దగూడెం రైల్వేట్రాక్ వద్ద పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారి దేవాపూర్ రైల్వేట్రాక్‌లో శనివారం ఉదయం దేవాపూర్ నుంచి మందమర్రి వైపు గూడ్స్ రైల్ వస్తుందని గేట్ వేశారు. దీంతో జాతీయహదారిపై రైల్వేగేట్ వద్ద వాహనాలు నిలిపారు. గూడ్స్ రైలు పూర్తిగా వెళ్లిపోకముందే అక్కడ గేట్‌ట్రోల్ నిర్వహకుడు గేట్ తెరిచాడు. దీంతో వాహనదారులు రైల్ వెళ్తుండగానే గేట్‌దాటి లోపలికి వెళ్లారు. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అసలే జాతీయ రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. గేటు తీసే సమయంలో నిబంధనలు పాటించకపోవడం ఏమిటని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గోలేటి టౌన్‌షిప్ లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమవేశంలో ఆయన మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించబోయే ప్రజా గర్జన ముగింపు కార్యక్రమానికి పెద్ద ఎత్తున సింగరేణి కార్మికులు తరలి రావాలని అన్నారు. లాభదాయకమైన వేజ్‌బోర్డుకు కృషి చేసిన పర్మినెంట్ వేజ్‌బోర్డు సభ్యులు సీతారామయ్యను గోలేటి బ్రాంచి నాయకులు సన్మానించారు. డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, బ్రాంచి ఇన్‌చార్జి నర్సయ్య, కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, చంద్రశేఖర్, కిరణ్‌బాబు, శ్రీనివాస్, ఆనంద్, ఫిట్ కార్యదర్శులు మల్లేష్, రాజేష్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ప్రత్యేక చొరవతోనే....

జైపూర్: ఏఐటీయూసీతో మెరుగైనవేజ్‌బోర్డ్ ఒప్పందం జరిగిందని ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఎస్టీపీసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్‌కుమార్, బాజీసైదా, వీరభద్రయ్య, సమ్మయ్య ఉన్నారు.

ఆశవర్కర్ ఆత్మహత్య



మెంగుబాయి మృతదేహం

కెరమెరి(ఆసిఫాబాద్): పురుగుల మందుతాగి ఆశవర్కర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని జోడేఘాట్ గ్రామ పంచాయతీలోని శివగూడ గ్రామానికి చెందిన టేకం మెంగుబాయి(30) భర్త టేకం మానిక్‌రావుతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం పొలం పనులు చేసింది. మధ్యాహ్నం సమయంలో భర్త పనుల నిమిత్తం కెరమెరికి వెళ్లాడు. ఇంటికి వెళ్లిన మెంగుబాయి పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబీకులు కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతిచెందింది. కాగా టేకం మానిక్‌రావుకు ముగ్గురు భార్యలు. వారిలో చిన్న భార్యా టేకం మెంగుబాయి ఆశా వర్కర్‌గా విధులు నిర్వహిస్తోంది. భర్త మానిక్‌రావు కెరమెరికి వెళ్లిన తరువాత ఇంట్లో ఏమైన గొడవలు జరిగాయా? లేదా.. ఇంకేదైన కారణం ఉందా? అనే విషయం తెలాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై నల్లా వెంకటేశ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పాడు.

నార్లాపూర్‌లో వ్యక్తి హత్య



బుజ్జి మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నార్లాపూర్‌లో శనివారం ముంజంపల్లి పోశం అలియాస్ బుజ్జి(50) దారుణహత్యకు గురయ్యాడు. సీఐ మహేందర్‌రెడ్డి వివరాల ప్రకారం... ముంజంపల్లి పోశం తన తమ్ముడి కొడుకైన ముంజంపల్లి సురేష్ ఇంటి పక్కకే నివాసం ఉంటున్నారు. మధ్యాహ్నం సమయంలో సురేష్ భార్య స్వప్న బావి దగ్గరకు నీటి కోసం వెళ్లినప్పుడు పోశం అసభ్యకరంగా మాట్లాడాడు. సాయంత్రం సురేష్‌కు జరిగిన విషయాన్ని స్వప్న చెప్పింది. దీంతో సురేష్ రోడ్డుపై ఉన్న పోశంను వాళ్లింటికి లాక్కెళ్లి దాడిచేయగా ఇంట్లోని గుమ్మానికి తల తగిలి తీవ్రగాయమై మృతిచెందాడు. మృతుడి భార్య 20ఏళ్ల క్రితమే చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మెరుగైన వేజ్‌బోర్డు సాధించాం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని వేజ్‌బోర్డు ఒప్పందం బొగ్గు పరిశ్రమలో చేయించుకున్నామని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శనివారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇతర పరిశ్రమల్లో వేజ్‌బోర్డు కాలపరిమితి 10సంవత్సరాలు ఉండగా బొగ్గు పరిశ్రమల్లో మాత్రం 5సంవత్సరాలకే ఉండేలా ఒప్పందం చేశామని అన్నారు. కార్మికులకు మెరుగైన వేజ్‌బోర్డు ఒప్పందం జరిగినా వేజ్‌బోర్డుపై దుష్ప్రచారం చేస్తున్న సంఘాలకు తగిన బుద్ధి చెప్పాలని కార్మికులను కోరారు. వేజ్‌బోర్డు ఒప్పందంపై సంతకం చేసిన హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ హైమద్ సైతం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఇతర సంస్థలో కాలపరిమితి 10 సంవత్సరాలు ఉండి వేతనాల పెరుగుదల 12 నుండి 15 శాతం ఉంటే బొగ్గు పరిశ్రమల్లో కాల పరిమితి 5 సంవత్సరాలకు ఒప్పించి 19 శాతం వేతనాల పెరుగుదలతో పాటు 25 శాతం అలవెన్సులపై పెంచి ఒప్పందం జరిగితే అవగాహన లేని టీబీజీకేఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శివరావు, శ్రీనివాస్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఆనంద్, ఫిట్ కార్యదర్శి వెంకటేశం పాల్గొన్నారు.

వడదెబ్బకు సొమ్మసిల్లిన ఐకేపీ వీవోఏ



వడదెబ్బకు గురై చికిత్స పొందుతున్న వీవోఏ సంతోష్

నెన్నెల: మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు చేస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొన్న మెట్‌పల్లి గ్రామానికి చెందిన వీవోఏ దుగుట సంతోష్ శనివారం దీక్షా శిబిరంలో వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన తోటి వీవోఏలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. వీవోఏలు తెలిపిన వివరాల ప్రకారం... మెట్‌పల్లి నుంచి సంతోష్ బైక్‌పై ఎండకు 15 కిలో మీటర్ల ప్రయాణం చేసి దీక్ష శిబిరానికి చేరుకున్నాడు. 15 నిమిషాల తర్వాత దాహం వేస్తుందని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పి పడిపోయాడు. చికిత్స అందించిన తర్వాత కోలుకున్నట్లు తోటి వీవోఏలు చెప్పారు. 41 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వీవోఏల సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని నెన్నెల మండల ఐకేపీ వీవోఏలు కోరుతున్నారు.

జూన్ 4న చలో కొత్తగూడెం

• ఏఐటీయూసీ కేంద్రకార్యదర్శి ముస్కె సమ్మయ్య



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా చలో కొత్తగూడెం కార్యక్రమం చేపట్టినట్లు ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య తెలిపారు. శనివారం ఆయన ఆర్కే 5 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో సాయంత్రం ప్రజాగర్జన పేరుతో బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనికి లక్ష మందిని సమీకరించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమను తెగ నమ్ముతూ ప్రైవేటీకరణ కాంట్రాక్టీకరణతో కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. 44 చట్టాలను నాలుగు కోడ్‌ల కింద తెచ్చి కార్మికులను కట్టు బానిసలుగా చేశారన్నారు. కాంట్రాక్టు కార్మికులకు 11వ వేతన ఒప్పందంలో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కంపెనీ వాస్తవ లాభాలను ప్రకటించి అందులో 35శాతం లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తగూడెంకు వెళ్లడం కోసం ప్రత్యేక రైలును ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. జూన్ 4 ఉదయం 8 గంటలకు బెల్లంపల్లి నుంచి ప్రారంభమై మంచిర్యాల మీదుగా కొత్తగూడెంకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి గునిగంటి నర్సింగరావు, ఫిట్ సెక్రెటరీ శ్రీనివాస్, కాంట్రాక్టు కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మండల కార్యదర్శి దొడ్డిపట్ల రవీందర్ ఉన్నారు.



చల్లని ఉపాయం

నస్పూర్‌కాలనీకి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి గోళ్ల శంకరయ్య చల్లదనం కోసం తన ద్విచక్రవాహనానికి గొడుగులాంటిది ఏర్పాటు చేశారు. నీడతో పాటు, చల్లదనం ఉండాలని పర్యావరణ పరిరక్షణలో భాగంగా బైక్‌కు రెండు వైపులా మొక్కలు ఏర్పాటు చేసుకుని, ఆ మొక్కలు గొడుగుల ఏర్పాటు చేసుకున్నదానికి ఆ మొక్క తీగలు పారేలా ఏర్పాటు చేశాడు. మనీప్లాంట్ మొక్క తీగల రూపంలో పెరుగుతుండగా, ఆ తీగలను చల్లదనం వచ్చేందుకు వినియోగిస్తున్నాడు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన శంకరయ్య దివ్యాంగుడిగా మారడంతో ఎక్కడికి వెళ్లాలన్నా స్కూటీనే వినియోగిస్తుండడం, వేసవి కాలం వేడిని తట్టుకోవడంతో పాటు, వానాకాలంలోనూ రక్షణగా ఉండేలా దీనిని స్వయంగా ఏర్పాటు చేసుకున్నాడు.

– మంచిర్యాలటౌన్